సాక్షి రాజన్న సిరిసిల్ల

గురువారం । 3 । ఆగస్టు । 2023



భక్తుల రద్దీ

వేములవాడ: రాజన్నను బుధవారం 10 వేల మంది భక్తులు దర్శించుకున్నారు. 5న హుండీలోని నగదు లెక్కించనున్నట్లు ఈవో కృష్ణప్రసాద్ తెలిపారు.



అంజన్న హుండీ లెక్కింపు

వేములవాడఅర్బన్: అగ్రహారం అంజన్న ఆలయంలోని హుండీని బుధవారం లెక్కించారు. ఐదు నెలల్లో రూ.4,81,803 వచ్చినట్లు ఈవో మారుతి తెలిపారు.

గరిష్టం/కనిష్టం
31.0/25.0

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. జిల్లాలో వర్షం కురిసే అవకాశం ఉంది. గాలిలో తేమ అధికంగా ఉంటుంది. ఈదురుగాలులు వేగంగా వీస్తాయి.

న్యూస్‌రీల్

విద్యార్థుల్లో అభ్యాసన సామర్థ్యం పెంచాలి



మాట్లాడుతున్న శ్రీలతరావు

బోయినపల్లి(చొప్పదండి): విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలు పెంపొందించేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని తొలిమెట్టు రాష్ట్ర పరిశీలకులు శ్రీలతరావు కోరారు. మండలకేంద్రంలోని హైస్కూల్‌లో నిర్వహిస్తున్న తొలిమెట్టు ప్రాథమిక ఉపాధ్యాయుల శిక్షణ శిబిరాన్ని బుధవారం సందర్శించి మాట్లాడారు. విద్యార్థులు పాఠశాలలో ఉపాధ్యాయులు చెప్పే అంశాలు ఆసక్తిగా వినేలా బోధన చేయాలని సూచించారు. ఈనెల 2 నుంచి 8వ తేదీ వరకు శిక్షణ శిబిరం కొనసాగనుంది. ఎంఈవో శ్రీనివాసదీక్షిత్, పీఎస్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జ్వరాలపై అప్రమత్తంగా ఉండాలి



పరిసరాలు పరిశీలిస్తున్న వైద్యాధికారి

కోనరావుపేట(వేములవాడ): వర్షాకాలంలో వచ్చే సీజనల్ జ్వరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా వైద్యాధికారి సుమన్‌మోహన్‌రావు పేర్కొన్నారు. మండలంలోని కనగర్తిలో బుధవారం పర్యటించారు. గ్రామంలోని ఇంటింటా జ్వరాల సర్వేను పరిశీలించారు. ఎస్సీ కాలనీలో పారిశుధ్యం పనులను పరిశీలించి, స్థానికులకు పలు సూచనలు చేశారు. నీరు నిల్వ ఉన్న గుంతల్లో దోమలు పెరిగి మలేరియా, డెంగీ, చికున్‌గున్యా వ్యాధులు సోకే ప్రమాదముందన్నారు. ఇంటి పరిసరాలలో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలన్నారు. సర్పంచ్ భారతి, హెచ్‌ఈవో లింగం, సీహెచ్‌వో బాలచందర్, హెల్త్ అసిస్టెంట్ సవాయిలాల్, ఏఎన్‌ఎం సరోజన, కార్యదర్శి కవితారెడ్డి ఉన్నారు.

రాజన్న సేవలో ఆర్డీవో



ఆర్డీవోను సత్కరిస్తున్న ఆలయ అధికారులు

వేములవాడ: వేములవాడకు బదిలీపై వచ్చిన ఆర్డీవో మధుసూదన్ బుధవారం రాజన్నను దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనం అవకాశం కల్పించారు. అనంతరం ఆలయ ఇన్‌స్పెక్టర్ పవన్‌కుమార్ ప్రసాదాలు అందజేసి, కండువా కప్పి సత్కరించారు. అనంతరం బాధ్యతలు స్వీకరించారు.

రైతులకు డ్రోన్ సేవలు



మాట్లాడుతున్న చైర్మన్ బాపురావు

ముస్తాబాద్(సిరిసిల్ల): పోతుగల్ సింగిల్‌విండో పరిధిలోని రైతులకు వ్యవసాయ పనులకు త్వరలోనే డ్రోన్ సేవలను అందిస్తామని చైర్మన్ తన్నీరు బాపురావు పేర్కొన్నారు. పోతుగల్‌లోని కార్యాలయంలో కర్షకమిత్ర ద్వారా రైతులకు రూ.44 లక్షల విలువ చేసే చెక్కులను బుధవారం పంపిణీ చేసి మాట్లాడారు. డ్రోన్ సేవల కోసం ఓ ఉద్యోగిని శిక్షణ కోసం చెన్నైకి పంపించినట్లు తెలిపారు. సింగిల్‌విండోలో పోర్టిఫైడ్ రైస్ ఉత్పత్తి ఫ్యాక్టరీ పనులు కొనసాగుతున్నట్లు తెలిపారు. వానాకాలం పంటల కోసం నానో యూరియా సిద్ధంగా ఉందన్నారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సహకార సంఘంలో ఫిక్స్‌డ్ డిపాజిట్లు పెద్ద ఎత్తున సేకరిస్తున్నట్లు తెలిపారు. డైరెక్టర్లు కట్ట బాపురావు, మాధవరావు, సతీశ్‌చందర్‌రావు, గన్నె ఆనంద్, బైరి శ్రీనివాస్, కీర్తన్, బాలయ్య, నర్సింలు, సీఈవో కృష్ణ పాల్గొన్నారు.

జిల్లాలో చిరుజల్లులు

సిరిసిల్ల: జిల్లాలో బుధవారం చిరుజల్లులు కురిశాయి. బోయినపల్లిలో అత్యధికంగా 8.8 మిల్లీమీటర్ల వర్షం పడగా రుద్రంగిలో 1.0, చందుర్తిలో 5.4, వేములవాడ రూరల్‌లో 4.0, వేములవాడలో 4.4, సిరిసిల్లలో 0.3, కోనరావుపేటలో 1.8, ఎల్లారెడ్డిపేటలో 3.4, వీర్నపల్లిలో 1.3, ముస్తాబాద్‌లో 1.8, తంగళ్లపల్లిలో 2.0, ఇల్లంతకుంటలో 1.8 మిల్లీమీటర్ల వర్షం కురిసింది.

దోమల దండయాత్ర

- నివాసాల మధ్యనే మురికినీరు
- కంపుకొడుతున్న కాలనీలు
- దోమల బెడదతో జనం బెంబేలు
- విస్తరిస్తున్న విషజ్వరాలు
- సిరిసిల్ల, వేములవాడల్లో డ్రెయినేజీలు అస్తవ్యస్తం



నివాసాల మధ్య మురికినీరు నిలిచిందని చెబుతున్న వీరు వేములవాడలోని 4వ వార్డు వాసులు. తమ ఇళ్ల మురికి నీరు నిలవడంతో దోమలు పెరిగిపోయాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమ కాలనీలో దుర్వాసన వస్తుందని చెబుతున్నారు.



ఇది సిరిసిల్ల శివారులోని సాయినగర్. ఇక్కడ ఏడాది పొడవునా మురికికూపం ఇలాగే ఉంటుంది. అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా లాభం లేకుండ పోతుందని స్థానికులు చెబుతున్నారు. జనావాసాల మధ్య ఉన్న మురికికూపం ద్వారా దోమల పెరిగి జ్వరాలు వస్తున్నాయి. స్థానికంగా దుర్గంధం వ్యాపిస్తోంది.



ఇది వేములవాడ మొదటి బైపాస్‌రోడ్డు కాలనీ వెనకాల. ఇంటి వెనకాలే పెద్ద మురికి కూపం ఉందని ఆ ప్రాంతానికి చెందిన ఆకుల ఆంజనేయులు, ప్రశాంత్ చూపిస్తున్నారు. ఏటా వర్షాకాలంలో దోమలు పెరిగి జ్వరాలు వస్తున్నాయని చెబుతున్నారు. అయినా ఎవరూ పట్టించుకోవడం లేదని వాపోతున్నారు.





ఈ రెండు డ్రెయినేజీలను చూస్తే వేములవాడలో పారిశుధ్య పనుల నిర్వహణ ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. వేములవాడ శివారుకాలనీల్లో ఇలాంటి డ్రెయినేజీలే కనిపిస్తుంటాయి. పాలకుల నిర్లక్ష్యంతో తమకు ఇబ్బందులు తప్పడం లేదని బైపాస్‌రోడ్డు ప్రాంతంలో నివసించే జనం ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

సిరిసిల్లటౌన్/వేములవాడ: జిల్లా ప్రజలపై దోమలు దండయాత్ర చేస్తున్నాయి. దోమలు పెరిగిపోవడంతో జ్వరబాధితులు పెరుగుతున్నారు. ఈక్రమంలో ప్రజా ఆరోగ్యంపై అధికారులు పట్టింపులేకుండా వ్యవహరిస్తున్నారు. వర్షాకాలం వ్యాధులతో ప్రజలు మంచాన పడుతున్నా అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు. జిల్లాలో రెండు మున్సిపాలిటీలు సిరిసిల్ల, వేములవాడల్లో పారిశుధ్యం నిర్వహణ అధ్వాన్నంగా మారింది. డ్రెయినేజీల్లో పూడిక పేరుకుపోయి కంపుకొడుతున్నాయి. మార్కెట్ ఏరియాల్లో చెత్తాచెదారం కుప్పలు కుప్పలుగా పేరుకుపోయి దోమలు విజృంభిస్తున్నాయి. ఆధ్యాత్మిక క్షేత్రం వేములవాడ మున్సిపల్ పరిధిలో పారిశుధ్య నిర్వహణ అధ్వానంగా ఉంది. ఎక్కడికక్కడ డ్రెయినేజీలు పూడిక నిండి మురుగు ముందుకు కదలనంటుంది. నిత్యం వేలాది మంది భక్తులు రాజన్న దర్శనానికి వేములవాడకు వస్తుంటారు.. అంత ప్రాముఖ్యమైన ప్రదేశంలో పరిసరాలు కంపుకొడుతున్నాయి.

విస్తరిస్తున్న వ్యాధులు

జిల్లాలో దోమలు విపరీతంగా పెరిగిపోవడంతో డెంగీ, మలేరియా వంటి జ్వరాలు విస్తరిస్తున్నాయి. జనావాసాల మధ్యే వర్షం నీరు నిలవడం, ప్రధాన డ్రెయినేజీ, కాలనీల్లోని మురుగుకాలువల్లోని సిల్టును బల్దియా ఎప్పటికప్పుడు తీసివేయించకపోవడంతో పరిస్థితి దారుణంగా మారింది. చెత్త సేకరణలో జాప్యం కూడా దోమల వ్యాప్తికి కారణమైతుంది.

మరుగున పడుతున్న పరి'శుభ్రత'

- ప్రథమశ్రేణి మున్సిపల్‌గా ఆవిర్భవించిన సిరిసిల్లలో 39 వార్డుల్లో 1,09,850 జనాభా ఉంది. వీరిని శానిటరీ ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ, కమిషనర్ వెల్దండి సమ్మయ్య పర్యవేక్షిస్తుంటారు.
- ప్రతిరోజు పట్టణంలో 50 మెట్రిక్ టన్నుల చెత్త ఉత్పత్తి అవుతోంది. పారిశుధ్య పనుల్లో ఇంటింటా చెత్త పేరుతో 48 మెట్రిక్ టన్నుల చెత్తను సేకరిస్తున్నారు.
- 39 వార్డుల్లో సుమారు 400 కార్మికులు అవసరం ఉండగా.. 277 మంది మాత్రమే పనిచేస్తున్నారు.

నివారణ చర్యలు మృగ్యం

- సిరిసిల్లలో ఫాగింగ్ మిషన్‌ను వినియోగించడం లేదు.
- డ్రెయినేజీల్లో ఆయిల్‌బాల్స్ వేయడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు.
- ఓపెన్ ప్లాట్లలో మురుగునీరు నిలిచి దోమలు, పందులకు ఆవాసాలుగా మారుతున్నాయి.

అవగాహన కల్పిస్తున్నాం



విషజ్వరాలు ప్రబలకుండా నివారణ చర్యలు తీసుకున్నాం. ప్రతి గ్రామంలో దోమలవ్యాప్తి, వ్యాధుల నివారణపై అవగాహన కల్పిస్తున్నాం. ఏఎన్‌ఎంల వద్ద మందులు ఉంచాం. జ్వరం వచ్చిన వారికి వైద్యుల సలహాలు, సూచనలతో వారు మందులు అందిస్తున్నారు. మన జిల్లాలో వైరల్ ఫీవర్స్ అవి కూడా పిల్లల్లో ఎక్కువగా ఉన్నాయి. గతేడాది 50 డెంగీ కేసులు నమోదయ్యాయి. – సుమన్ మోహన్‌రావు, డీఎంహెచ్‌వో

పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి



ఎక్కడైనా పారిశుధ్యం పనుల్లో లోపం ఉంటే నేరుగా చెబితే చర్యలు తీసుకుంటాం. వారంలో మూడు రోజులు డ్రై డే నిర్వహిస్తున్నాం. ఓపెన్ ప్లాట్లలో బ్లీచింగ్ చల్లిస్తున్నాం. యజమానులకు ఓపెన్‌ప్లాట్లలో శానిటేషన్ నిర్వహణపై నోటీసులిచ్చాం. రెగ్యులర్‌గా ఫాగింగ్, ఆయిల్‌బాల్స్ వేస్తున్నాం.

– వెల్దండి సమ్మయ్య, సిరిసిల్ల మున్సిపల్ కమిషనర్

చర్యలు తీసుకుంటున్నాం

ఇటీవల కురిసిన వర్షాలకు వరదనీరు, బురద పేరుకుపోయింది. చాలా ప్రాంతాల్లో మురికినీరు నిలవడంతో అందులో ఆయిల్‌బాల్స్ వేయిస్తున్నాం. దోమలు పెరగకుండా చర్యలు తీసుకుంటున్నాం. నిత్యం ఫాగింగ్ చేయిస్తున్నాం.

– కిరణ్, హెల్త్‌అసిస్టెంట్, వేములవాడ

మినీస్టేడియం పనులు త్వరగా పూర్తి చేయండి

- కలెక్టర్ అనురాగ్ జయంతి



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్

వేములవాడఅర్బన్: మినీస్టేడియం పనులను త్వరగా పూర్తి చేయాలని కలెక్టర్ అనురాగ్ జయంతి సూచించారు. వేములవాడ మున్సిపల్ పరిధి తిప్పాపూర్ శివారులో రూ.5 కోట్లతో నిర్మిస్తున్న మినీ స్టేడియం పనులను బుధవారం పరిశీలించారు. క్రికెట్‌గ్రౌండ్, వాలీబాల్, బాస్కెట్‌బాల్, కబడ్డీ, ఫుట్‌బాల్ క్రీడా కోర్టులను సిద్ధం చేయాలని సూచించారు. డార్మెటరీలను నిర్మించాలన్నారు. స్టేడియం లోపల ఆరు సింథటిక్ ట్రాక్‌లు సిద్ధం చేయాలన్నారు. టీఎస్‌ఈడబ్ల్యూఐడీసీ ఈఈ విరూపాక్ష, సహాయ ఇంజినీర్ శ్రీకాంత్, సెస్ డైరెక్టర్ హరిచరణ్‌రావు ఉన్నారు.

కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం



క్షీరాభిషేకం చేస్తున్న బీడీ టేకేదారులు

సిరిసిల్లటౌన్:ముఖ్యమంత్రి కే.చంద్రశేఖర్‌రావు నిజమైన కార్మిక పక్షపాతి అని సిరిసిల్ల మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ కొనియాడారు. స్థానిక అంబేడ్కర్ చౌరస్తాలో బుధవారం బీడీ టేకేదారుల ఆధ్వర్యంలో సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. జెడ్పీ వైస్‌చైర్మన్ మాట్లాడుతూ టేకేదారుల సమస్యలు గుర్తించిన సీఎం ప్రోత్సాహం అందించడం శుభపరిణామన్నారు. టీఎస్‌పీటీడీసీ చైర్మన్ గూడూరి ప్రవీణ్, జిల్లా గ్రంథాలయసంస్థ చైర్మన్ ఆకునూరి శంకరయ్య, బీఆర్‌ఎస్ పట్టణాధ్యక్షుడు జిందం చక్రపాణి, కార్మికవిభాగం అధ్యక్షుడు వెంగల శ్రీనివాస్, బీడీ టేకేదారులు పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన ఆర్డీవో



కలెక్టర్‌ను కలిసిన ఆర్డీవో, డిప్యూటీ కలెక్టర్‌లు

సిరిసిల్ల: వేములవాడ ఆర్డీవోగా నియమితులైన పి.మధుసూదన్ బుధవారం విధుల్లో చేరారు. కలెక్టరేట్‌లో కలెక్టర్ అనురాగ్ జయంతిని కలిసి పూలమొక్కను అందించారు. అంతకుముందు సిరిసిల్ల జిల్లా భూసేకరణ విభాగం ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన తంగళ్లపల్లి తహసీల్దార్ పి.సదానందం కలెక్టర్‌ను కలిసి పూలమొక్క అందించారు.

విధుల్లో చేరిన తహసీల్దార్లు

జిల్లాకు బదిలీపై వచ్చిన తహసీల్దార్లు బుధవారం విధుల్లో చేరారు. జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతిని కలిసి పూలమొక్కలు అందించారు. సిరిసిల్ల తహసీల్దార్‌గా ఎస్.సత్యనారాయణ, వేములవాడ తహసీల్దార్‌గా ఎం.కాశీచరణ్, చందుర్తికి సీహెచ్.శ్రీనివాస్, రుద్రంగికి కె.శ్రీలత, వీర్నపల్లికి ఎం.ఉమారాణి, తంగళ్లపల్లికి కె.విజయ్ ప్రకాశ్‌రావు, గంభీరావుపేటకు ఎల్.భూపతి, ఇల్లంతకుంటకు జావెద్ అహ్మద్, ముస్తాబాద్‌కు కె.గణేశ్, కోనరావుపేట తహసీల్దార్‌గా ఎ.ఉమాశంకర్ నియమితులయ్యారు. ఇప్పటికే కొందరు తహసీల్దార్లు విధుల్లో చేరారు.

కేడీసీసీ బ్యాంక్ సేవలు వినియోగించుకోవాలి

- రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు వినోద్‌కుమార్



బ్యాంక్‌ను ప్రారంభిస్తున్న వినోద్‌కుమార్

వీర్నపల్లి(సిరిసిల్ల): కేడీసీసీ బ్యాంక్ సేవలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్ కోరారు. వీర్నపల్లిలో నూతనంగా ఏర్పాటు చేసిన కేడీసీసీబీని టెస్కాబ్ చైర్మన్ కొండూరి రవీందర్‌రావు, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్యలతో కలిసి బుధవారం ప్రారంభించారు. వినోద్‌కుమార్ మాట్లాడుతూ రైతులు ఆర్థికంగా అభివృద్ధి చెందడానికి సీఎం కేసీఆర్ అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెడుతున్నారన్నారు. బ్యాంక్ డిజిటలైజేషన్ సేవలను అందుబాటులో ఉంచుతామన్నారు. వీర్నపల్లి మండలానికి అల్మాస్‌పూర్ సొసైటీ నుంచి రూ.14కోట్లు, రైతులకు రుణాలు ఇచ్చినట్లు తెలిపారు. వీర్నపల్లిని మండల కేంద్రంగా చేసి ఎన్నో అభివృద్ధి పనులు చేశామన్నారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శులు, కార్మికులు వినోద్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. జిల్లా వైస్‌చైర్మెన్ రమేశ్, జిల్లా డైరెక్టర్ మోహన్‌రెడ్డి, సీఈవో సత్యనారాయణ, ఎంపీపీ మాలోత్ భూల, జెడ్పీటీసీ కళావతి, సెస్ డైరెక్టర్ మల్లేశం, తహసీల్దార్ తఫాజుల్ హుస్సేన్, ఎంపీడీవో నరేశ్‌కుమార్, సర్పంచ్ దినకర్, ఎంపీటీసీ అరుణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

హోంగార్డులను రెగ్యులరైజ్ చేయాలి

సిరిసిల్లఅర్బన్: హోంగార్డులుగా విధులు నిర్వహిస్తున్న తమను రెగ్యులరైజ్ చేయాలని కోరతూ జిల్లా హోంగార్డ్స్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో బుధవారం రాష్ట్ర ప్రణాళిక సంఘం వైస్‌చైర్మన్ వినోద్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. సిరిసిల్లలో కలిసి తమ సమస్యలు తెలిపారు. చాలా ఏళ్లుగా జిల్లాలో 201 మంది హోంగార్డులం విధులు నిర్వహిస్తున్నామని, తమ సమస్యలు పరిష్కరించాలని కోరారు.

మిడ్‌మానేరుకు స్వల్ప ఇన్‌ఫ్లో



మిడ్‌మానేరు ప్రాజెక్టు

బోయినపల్లి(చొప్పదండి): మిడ్‌మానేరు ప్రాజెక్టుకు స్వల్పంగా వరద ఇన్‌ఫ్లో కొనసాగుతోంది. బుధవారం సాయంత్రం ఆరు గంటల వరకు ప్రాజెక్టులోకి 800 క్యూసెక్కుల మేర వరద నీరు వచ్చి చేరుతోంది. ప్రస్తుతం ప్రాజెక్టు నీటిమట్టం 20.45 టీఎంసీలకు చేరింది.

ఎన్నాళ్లకెన్నాళ్లకు!

- రుణమాఫీకి లైన్‌క్లియర్
- నేటి నుంచి సదరు ప్రక్రియ
- ఉమ్మడి జిల్లాలో 3.49 లక్షల మందికి లబ్ధి

సాక్షి ప్రతినిధి, కరీంనగర్: సుదీర్ఘ నిరీక్షణ అనంతరం అన్నదాతల ఆశలు ఫలించాయి. లక్షలోపు రుణమాఫీ చేస్తామని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించగా సదరు ప్రక్రియ నాలుగేళ్ల అనంతరం తుదిదశకు చేరుకోవడం గమనార్హం. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ప్రధానమైంది సాగురంగమే. ఉభయ గోదావరి జిల్లాలతో పోటీపడే ఉమ్మడి కరీంనగర్‌ది ప్రత్యేక ముద్ర. ప్రధానంగా వరి, పత్తి, మొక్కజొన్న, పసుపు, చెరకు పంటలకు ప్రసిద్ధి కాగా చిన్న, సన్నకారు రైతులే ఎక్కువ. ఈక్రమంలో బ్యాంకు రుణంతోనే ఏటా రెండు పంటలు సాగు చేస్తుంటారు. అయితే అతివృష్టి లేదా అనావృష్టి అన్నదాతలను ఆందోళనకు గురిచేస్తుండగా దిగుబడులు ఒక్కోసారి దిగదుడుపే. ఈ నేపథ్యంలో ప్రభుత్వం ప్రకటించే రుణమాఫీ ప్రకటనే రైతులకు ఒకింత ధైర్యాన్నిస్తుండగా మాఫీ అమలు ఆగుతూ సాగింది. 2018 డిసెంబర్ 11వరకు రూ.లక్షలోపు రుణం తీసుకున్న రైతులకు రుణమాఫీ ప్రకటించగా ఉమ్మడి జిల్లాలో 3,49,474 మందికి లబ్ధి చేకూరనుంది. రూ.1200 కోట్ల మేర రుణమాఫీ జరగనుంది.

ఆగుతూ సాగిన ప్రక్రియ

టీఆర్‌ఎస్ ప్రభుత్వం రుణమాఫీ ప్రకటించగా నాలుగు విడతలుగా మాఫీ చేస్తామని గతంలో ప్రకటించింది. రూ.25వేలలోపు రుణం తీసుకున్న రైతులకు ఒకసారి, రూ.50వేలలోపు మరోసారి, రూ.75 వేలు, రూ.లక్ష చివరిసారి ఇలా నాలుగు విడతలుగా మాఫీ ఇలా 2019లోనే సదరు ప్రక్రియ పూర్తికావాలి. కానీ.. కేవలం రూ.25 వేల లోపు రుణం తీసుకున్నవారికి మాత్రమే మొదటి విడత మాఫీ చేశారు. ఆ తర్వాత మిగతా ప్రక్రియ ఆగిపోయింది. ఓసారి సమాచారం సేకరించడం మళ్లీ అటకెక్కించడం చేశారు. మొదటి విడతలో కరీంనగర్ జిల్లాలో 15,200 మంది లబ్ధిపొందగా రాజన్న సిరిసిల్ల జిల్లాలో 4,663, పెద్దపల్లి జిల్లాలో 14,636, జగిత్యాల జిల్లాలో 27 వేల మందికి మాత్రమే రుణమాఫీ జరిగింది.

జిల్లాలవారీగా రుణమాఫీ ఇలా..

జిల్లా	అర్హులు	మొదటివిడత మాఫీ	ఇంకా కావాల్సిన వారు
కరీంనగర్	91,991	15,200	76,791
రాజన్నసిరిసిల్ల	61,783	4,663	57,210
పెద్దపల్లి	92,700	14,636	78,064
జగిత్యాల	1,03,000	27,000	76,000

వడ్డీ డబ్బులు తిరిగొచ్చేనా?

ఉమ్మడి జిల్లావ్యాప్తంగా కర్షకులు రుణమాఫీ కోసం నిరీక్షిస్తున్నారు. ప్రభుత్వం నాలుగు విడతల్లో మాఫీ చేస్తుందని ప్రకటించడంతో చాలామంది రుణాలు తిరిగి చెల్లించలేదు. వడ్డీ డబ్బులు కడుతూ వచ్చారు. మొత్తంగా రూ.400ల కోట్ల వరకు వడ్డీ చెల్లించినట్లు సమాచారం. ధాన్యం డబ్బులు ఖాతాలో జమైతే చాలు బ్యాంకర్లు వాటిని రుణానికి మిత్తికింద జమచేశారు. కరీంనగర్, రాజన్న సిరిసిల్ల, పెద్దపల్లి, జగిత్యాల జిల్లాల్లో 50 శాతానికి పైగా రైతులది ఇదే పరిస్థితి. 2019లోనే పూర్తిగా రుణమాఫీ జరగాల్సి ఉండగా నాలుగేళ్లుగా వడ్డీ డబ్బులు చెల్లించి రెన్యువల్ చేసుకున్నారు. ఈ క్రమంలో సదరు డబ్బులు కూడా రైతుల ఖాతాలో జమచేయాలని డిమాండ్ చేస్తున్నారు. లేకుంటే మాఫీ చేసినా పెద్దగా రైతులకు ఒరిగిందేమి లేదని అభిప్రాయపడుతున్నారు. కరీంనగర్ జిల్లాలో 76,791 మందికి ఇంకా రుణమాఫీ కావాల్సి ఉండగా రాజన్న సిరిసిల్ల 57,210, పెద్దపల్లి 78,064, జగిత్యాల జిల్లాలో 76 వేల మంది రైతులు ఇప్పటికీ రెన్యువల్ కింద వడ్డీ చెల్లిస్తూ రుణాలు తీసుకుంటున్నారు.

రైతుబాంధవుడు సీఎం కేసీఆర్



దేశంలో ఏ రాష్ట్రం చేపట్టని విధంగా, రైతాంగ అభివృద్ధి కోసం సీఎం కేసీఆర్ తీవ్రంగా కృషి చేస్తున్నారు. రుణమాఫీకి కార్యాచరణ రూపొందించడంపై కేసీఆర్‌కు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేస్తున్నా. కరోనా వంటి విపత్కర పరిస్థితులు, ఎఫ్‌ఆర్బీఎం పరిమితులు, నోట్ల రద్దు, జీఎస్టీ వంటి కేంద్ర అనాలోచిత నిర్ణయాలతో రాష్ట్ర ఆదాయం పడిపోయినా తెలంగాణలో రైతుల కోసం నిరంతరాయంగా కృషి చేస్తున్నారు. నేడు రూ. 19వేల కోట్ల భారాన్ని భరిస్తూ తీసుకున్న రైతు రుణమాఫీ నిర్ణయం విప్లవాత్మకం. ఇవే కాకుండా రైతుబంధు, రైతు బీమా, ఉచిత కరెంట్, నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, కాళేశ్వరం జలాలతో రాష్ట్రాన్ని ధాన్యాగారంగా తీర్చిదిద్దారు.

– గంగుల కమలాకర్,
రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి

విద్యుత్ బిల్లులు చెల్లించండి

- 'సెస్' ఎండీ రామకృష్ణ

సిరిసిల్ల: జిల్లాలో విద్యుత్ వినియోగదారులు బిల్లులు చెల్లించాలని సహకార విద్యుత్ సరఫరా సంఘం (సెస్) మేనేజింగ్ డైరెక్టర్ రామకృష్ణ బుధవారం కోరారు. జిల్లాలో విద్యుత్ పంపిణీ చేసే 'సెస్' సంస్థ ఆర్థిక ఇబ్బందుల్లో ఉందని వివరించారు. గృహాలకు సంబంధించిన విద్యుత్ బిల్లులు రూ.25.65 కోట్లు పెండింగ్‌లో ఉన్నాయని, వాణిజ్య సర్వీసులకు సంబంధించి రూ.8.18 కోట్లు, పరిశ్రమలకు సంబంధించి రూ.4.74 కోట్లు, కుటీర పరిశ్రమలు రూ.1.44 కోట్లు, వ్యవసాయ కనెక్షన్ల విద్యుత్ బిల్లులు రూ.8.02కోట్లు వసూలు కావాల్సి ఉందని వివరించారు. వినియోగదారులు విధిగా బిల్లులు చెల్లించి సంస్థ అభివృద్ధికి సహకరించాలని కోరారు. రూ.10వేలకు పైగా బకాయిలున్న వారికి నోటీసులు జారీ చేశామని, హైకోర్టు ఆదేశాల మేరకు ఒకే ప్రాంగణంలో 10హెచ్‌పీల కంటే ఎక్కువ విద్యుత్ వినియోగిస్తున్న ఎస్‌ఎస్‌ఐ యూనిట్లకు బ్యాక్ బిల్లింగ్ డిమాండ్ నోటీసులు జారీ చేశామన్నారు. ఎస్‌ఎస్‌ఐ యూనిట్ల యజమానులు వెంటనే బిల్లులు చెల్లించాలని ఎండీ కోరారు. ఆగస్టు 12లోగా బిల్లులు చెల్లించకుంటే సెస్ నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

కండ్ల కలకతో భయం లేదు

- కలెక్టర్ అనురాగ్ జయంతి

సిరిసిల్ల: జిల్లాలో కండ్ల కలకతో భయం లేదని కలెక్టర్ అనురాగ్ జయంతి తెలిపారు. జిల్లా వైద్యాధికారి సుమన్‌మోహన్‌రావుతో బుధవారం ఫోన్‌లో మాట్లాడారు. జిల్లాలో కండ్ల కలక ఇన్‌ఫెక్షన్‌తో ప్రజలు భయపడాల్సిన అవసరం లేదన్నారు. కండ్లు ఎర్రబడడం, నీరు కారడం, వాపు వంటి లక్షణాలు కనిపిస్తే చికిత్స చేయించుకోవాలన్నారు. సిరిసిల్ల, వేములవాడ ఆస్పత్రుల్లోని పీహెచ్‌సీలు, సీహెచ్‌సీలలో మందులు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఎలాంటి సమస్యలున్నా సమీపంలోని ఆస్పత్రిని లేదా ఆశవర్కర్లు, ఏఎన్‌ఎంలను సంప్రదించాలని కోరారు.

క్లుప్తంగా

షార్ట్‌సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం



కాలిపోతున్న ఇంట్లోని వస్తువులు

సిరిసిల్లఅర్బన్: సిరిసిల్ల మున్సిపల్ పరిధి చిన్న బోనాలలోని బానోత్ తిరుపతినాయక్ ఇంట్లో మంగళవారం అర్ధరాత్రి ప్రమాదవశాత్తు షార్ట్ సర్క్యూట్ జరిగింది. మంటలను గమనించిన స్థానికులు వెంటనే అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. వారు చేరుకొని మంటలను అదుపుచేశారు. షార్ట్ సర్క్యూట్ సమయంలో ఇంటిలో తిరుపతినాయక్ ఒక్కడే ఉండడంతో పెను ప్రమాదం తప్పింది.

కిడ్నీ బాధితునికి పూర్వ విద్యార్థుల ఆర్థికసాయం



రమేశ్ తల్లికి రూ.50 వేల చెక్కు అందిస్తున్న పూర్వ విద్యార్థులు

బోయినపల్లి(చొప్పదండి): మండలంలోని కోరెం గ్రామానికి చెందిన కిడ్నీ బాధితుడు మారుపాక రమేశ్ కుటుంబానికి బుధవారం కోరెం హైస్కూల్ 2002–2003 పదోతరగతి పూర్వ విద్యార్థులు రూ.50,500 ఆర్థికసాయం అందించారు. గ్రామానికి చెందిన రమేశ్ రెండు కిడ్నీలు పాడవడంతో హైదరాబాద్‌లోని చికిత్స పొందుతున్నాడు. కిడ్నీ మార్పిడికి పెద్ద మొత్తంలో డబ్బులు అవసరం కావడంతో పూర్వ విద్యార్థులు అండగా నిలిచారు. మరింత మంది ముందుకొచ్చి రమేశ్‌ను ఆదుకోవాలని పూర్వ విద్యార్థులు కోరుతున్నారు. ఉపసర్పంచ్ గాజర్ల రోహిణి కిరణ్, వేల్పుల రమేశ్, ఎర్రగడ్డం రాజశేఖర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

సీఐని కలిసిన వైఎస్సార్‌టీపీ నాయకులు



సీఐ ఉపేందర్‌ను సత్కరిస్తున్న నాయకులు

సిరిసిల్లటౌన్: సిరిసిల్ల టౌన్ సీఐ ఉపేందర్‌ను వైఎస్సార్‌టీపీ జిల్లా అధ్యక్షుడు చొక్కాల రాము, నాయకులు బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనను శాలువాతో సత్కరించి, శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు అనిల్, ఎల్లయ్య, రాజు, ప్రశాంత్, సత్యం తదితరులు పాల్గొన్నారు.

శిథిలావస్థలో పశువైద్యశాలలు



ఇది వేములవాడ పట్టణంలోని పశువైద్య కేంద్రం. దాదాపు 50 ఏళ్ల క్రితం నిర్మించిన ఈ భవనంలోనే నేటికీ పశువులకు సిబ్బంది వైద్య సేవలందిస్తున్నారు. పూర్తిగా శిథిలావస్థకు చేరి, వర్షానికి నీరు లోపలికి వస్తోంది. ఇది ఈ ఒక్క కేంద్రం పరిస్థితి మాత్రమే కాదు రాజన్నసిరిసిల్ల జిల్లాలోని ఇలాంటివి 9 ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. నూతన భవనాల కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినప్పటికీ మంజూరు కాకపోవడంతో పాత భవనాల్లోనే పని చేస్తున్నారు.



వీర్నపల్లిలో పగుళ్లు చూపిన పశువైద్యశాల

- ప్రతిపాదనల్లోనే కొత్త భవనాల మంజూరు అంశం
- జిల్లాలో పశువైద్యులు, సిబ్బంది కొరత
- ఉన్నవారితోనే నెట్టుకొస్తుండటంతో ఇబ్బందులు

వేములవాడరూరల్: పశువులకు గ్రామాల్లోనే వైద్యం అందించడానికి ప్రభుత్వం పశువైద్యశాలలను ఏర్పాటు చేసింది. కానీ రాజన్న సిరిసిల్ల జిల్లాలోని 13 మండలాల్లో ఏళ్లనాటి పాత భవనాల్లోనే నేటికీ వైద్యాధికారులు, సిబ్బంది పశువులకు వైద్యం అందిస్తున్నారు. జిల్లాలో 17 పశువైద్యశాలలు ఉండగా 9 మంది పశువైద్యులు విధులు నిర్వహిస్తున్నారు. ఒకరు డిప్యుటేషన్‌పై గంభీరావుపేటలో ఉన్నారు. ఉప కేంద్రాలను కలుపుకొని మొత్తం 31 కేంద్రాల్లో 88 మంది సిబ్బంది ఉండాల్సి ఉండగా ప్రస్తుతం 48 మందితోనే సేవలందిస్తున్నారు. ఫలితంగా పశువైద్యులు, సిబ్బంది ఇబ్బందులు పడుతున్నారు.

5 గ్రామాల్లో ఇన్‌చార్జి వైద్యాధికారులు

శిథిలావస్థలో ఉన్న పశువైద్యశాలలకు నూతన భవనాల మంజూరు కోసం మానాల, బండలింగంపల్లి, నూకలమర్రి, శాత్రాజుపల్లి, తంగళ్లపల్లి, వేములవాడ, గొల్లపల్లి గ్రామాల నుంచి ప్రతిపాదనలు పంపించారు. వీటిలో పోత్గల్, ఆవునూరు గ్రామాల్లో ఎమ్మెల్యే నిధులతో నిర్మాణ పనులు జరుగుతున్నాయి. హన్మాజీపేట, రుద్రంగి, ఇల్లంతకుంట, ఎల్లారెడ్డిపేట, కోనరావుపేట గ్రామాల్లో వైద్యాధికారులు లేక ఇన్‌చార్జిలతోనే వైద్య సేవలు కొనసాస్తున్నారు. జిల్లాలో అటెండర్లు 31 మందికి గాను 11 మంది ఉన్నారు. వీరితోపాటు ఔట్‌సోర్సింగ్ సిబ్బంది ఐదుగురితో ప్రస్తుతం సేవలు అందుతున్నాయి. నూకలమర్రి, మానాల, రుద్రవరం గ్రామాల పశువైద్యశాలలను ఇతర ప్రభుత్వ భవనాల్లో కొనసాగిస్తున్నారు.

నిధులు మంజూరైతే కొత్తవి నిర్మిస్తాం



జిల్లాలో శిథిలావస్థలో ఉన్న పశువైద్యశాలల వివరాలను తెలుపుతూ నూతన భవనాల కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించాం. నిధులు మంజూరు కాగానే కొత్తవి నిర్మిస్తాం. పశువుల మందులకు ఎలాంటి కొరత లేదు. – డాక్టర్ కొమురయ్య, జిల్లా పశువైద్యాధికారి

కులవృత్తులకు పెద్దపీట

- రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు వినోద్‌కుమార్



సన్మానిస్తున్న సెలూన్ నిర్వాహకుడు జితేందర్

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల):రాష్ట్ర ప్రభుత్వం కులవృత్తులను ప్రోత్సహించేందుకు పెద్దపీట వేస్తుందని రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్ పేర్కొన్నారు. ఎల్లారెడ్డిపేటలోని బండలింగంపల్లికి చెందిన గౌరిటికార్ జితేందర్ నిర్వహిస్తున్న సాయి సెలూన్‌ను బుధవారం పరిశీలించారు. రాష్ట్ర ప్రభుత్వం సెలూన్లకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్‌ను అందిస్తుందని తెలిపారు. పేదరికం అనుభవిస్తూ షాపులు నడుపుతున్న వారికి చేయూతనందించాలనే ఉద్దేశంతో ఉచిత విద్యుత్‌ను అమలు చేస్తున్నట్లు తెలిపారు. రానున్న రోజుల్లో సీఎం కేసీఆర్‌తో మాట్లాడి దుకాణాల విద్యుత్ వాడకాన్ని బట్టి యూనిట్లను పెంచేలా నిర్ణయాలు తీసుకుంటామన్నారు. ఇందుకు ప్రతీ నెల సెలూన్‌లలో ఎంతవరకు విద్యుత్‌ను వినియోగిస్తున్నారనే వివరాలు సేకరించాలని సెస్ చైర్మన్ చిక్కాల రామారావుకు సూచించారు. బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, నాయకులు ఇల్లందుల శ్రీనివాస్‌రెడ్డి, తడుకల దేవరాజు, తడుకల స్వామి, నిర్వాహకుడు గౌరిటికార్ జితేందర్ తదితరులు పాల్గొన్నారు.

మిషన్ కాకతీయతో భూగర్భ జలాల పెంపు

మిషన్‌కాకతీయతో చెరువులు, కుంటలను అభివృద్ధి చేయడంతో నేడు అవి జలకళను సంతరించుకున్నాయని రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్ పేర్కొన్నారు. ఎల్లారెడ్డిపేటలో బుధవారం విలేకరులతో మాట్లాడారు. గోదావరి, కృష్ణ నదులతోపాటు రాష్ట్రంలోని ఎత్తిపోతల పథకాల ద్వారా సాగునీటి కష్టాలు తీరాయన్నారు. రాష్ట్రంలో 33 మెడికల్ కాలేజీలు ఏర్పాటు చేసుకున్నామని, అన్ని జిల్లా కేంద్రాలలో 500 బెడ్ల సామర్థ్యం గల ఆస్పత్రులను రానున్న రోజుల్లో అందుబాటులోకి తేనున్నట్లు తెలిపారు. రానున్న ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌ను మరోసారి ఆశీర్వదిస్తే ఐదేళ్లలో ఊహించని అభివృద్ధి జరుగుతుందన్నారు. ఎంపీపీ పిల్లి రేణుక, జెడ్పీటీసీ చీటి లక్ష్మణ్‌రావు, సెస్ డైరెక్టర్ వరుస కృష్ణహరి, సింగిల్‌విండో చైర్మన్ గుండారపు కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆయుర్వేదంతో దీర్ఘకాలిక వ్యాధులు నయం



వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యులు

కోనరావుపేట(వేములవాడ): ఆయుర్వేద వైద్యంలో అన్ని రకాల దీర్ఘకాలిక వ్యాధులు నయమవుతాయని డాక్టర్ కళ్యాణి పేర్కొన్నారు. మండలంలోని కనగర్తిలో బుధవారం ఉచిత ఆయుర్వేద శిబిరం నిర్వహించారు. గ్రామంలోని మహిళలకు, ప్రజలకు పలు రకాల వ్యాధులకు పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. చర్మ వ్యాధులకు, మలబద్ధకం, శ్వాసకోశ, ఆస్తమా వ్యాధులకు పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. ఆరోగ్యవిషయాలతో కూడిన పుస్తకాన్ని ఆవిష్కరించారు. సర్పంచ్ భారతి, కార్యదర్శి కవిత, ఫార్మాసిస్ట్ ఆశ, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లను ప్రోత్సహించాలి

- డీఆర్‌డీవో గౌతమ్‌రెడ్డి



మాట్లాడుతున్న డీఆర్‌డీవో గౌతమ్‌రెడ్డి

సిరిసిల్ల: జిల్లాలో ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లను ప్రోత్సహించాలని డీఆర్‌డీవో, జెడ్పీ సీఈవో బి.గౌతమ్‌రెడ్డి కోరారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో బుధవారం పీఎంఎఫ్‌ఎంఈ ఆన్‌లైన్ దరఖాస్తులపై అవగాహన సదస్సు నిర్వహించారు. గౌతమ్‌రెడ్డి మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో చిన్నతరహా పరిశ్రమలు, ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లను యువకులు నెలకొల్పేలా ప్రోత్సహించాలన్నారు. బ్యాంకు రుణాలు ఇప్పించి స్వయం ఉపాధి సాధించేలా చూడాలన్నారు. పీఎంఎఫ్‌ఎంఇ పథకంలో ఆన్‌లైన్ దరఖాస్తులపై అవగాహన కల్పించారు. జిల్లా పరిశ్రమల శాఖ జీఎం ఉపేందర్‌రావు, ఎల్‌డీఎం మల్లికార్జున్, అదనపు డీఆర్‌డీవో రవికుమార్, డీపీఎం పద్మయ్య తదితరులు పాల్గొన్నారు.

ముంబైలో రుద్రాభిషేకం



గంగాజలం తీసుకువస్తున్న మహిళలు

కోనరావుపేట: ముంబైలోని సిద్ధేశ్వర్ శంకర్ మహాదేవ్ ఆలయంలో తెలుగువారి ఆధ్వర్యంలో బుధవారం రుద్రాభిషేకం నిర్వహించారు. కోనరావుపేట మండలంలోని వెంకట్రావుపేటకు చెందిన రాపెల్లి సతీశ్ ఆధ్వర్యంలో శ్రావణమాసం సందర్భంగా కాశీ నుంచి తెచ్చిన గంగాజలంతో అభిషేకం జరిపారు. కార్యక్రమాన్ని చాందివెలి ఎమ్మెల్యే దిలీప్ మామా లాండే ప్రారంభించారు. భక్తులందరికీ తీర్థప్రసాదాలు, అల్పాహారం అందజేయగా జిల్లాకు చెందినవారు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమంలో అశోక్ దాదీ మటేకర్, ప్రయాగ్‌లాండే, సాగర్ ఏక్‌నాథ్, కేటీ తివారీ, రేఖ ప్రముఖ్ సుశీల్ జాదవ్, మంగేశ్ తదితరులు పాల్గొన్నారు.

తల్లిపాలతోనే బిడ్డకు ఆరోగ్యం

- పిల్లల వైద్యుడు కందేపి ప్రసాద్‌రావు



మాట్లాడుతున్న పిల్లల వైద్యుడు ప్రసాద్‌రావు

సిరిసిల్ల: తల్లిపాలతోనే బిడ్డకు సంపూర్ణ ఆరోగ్యమని, పుట్టిన తరువాత తప్పనిసరిగా తల్లిపాలు తాగించాలని జిల్లా పిల్లల వైద్యనిపుణుల పూర్వ అధ్యక్షుడు, ప్రముఖ వైద్యుడు కందేపి ప్రసాద్‌రావు పేర్కొన్నారు. సిరిసిల్లలోని వాణి నర్సింగ్‌హోమ్‌లో బుధవారం తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ప్రసాద్‌రావు మాట్లాడుతూ పిల్లలకు ముర్రపాలు తాగించడం ద్వారా వ్యాధి నిరోధకశక్తి పెరుగుతుందన్నారు. భవిష్యత్‌లో పిల్లలు జబ్బుల బారిన పడకుండా ఉంటారన్నారు. పిల్లలకు కనీసం ఆరు నెలలు తల్లి పాలు పట్టించాలన్నారు. స్త్రీవైద్య నిపుణులు శ్రీవాణి మాట్లాడుతూ పుట్టిన వెంటనే పసిపాపకు తల్లిపాలు ఇవ్వాలనన్నారు. బిడ్డకు పాలు ఇవ్వడంతోనే తల్లి సైతం ఆరోగ్యంగా ఉంటుందని వివరించారు. ఆర్థోపెడిక్ ఎస్.వి.రమణారావు, వైద్యులు తిరుపతి, గోపినాథ్, ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

పశువైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

- మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీనివాస్



పశువైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎంపీపీ, ఏఎంసీ చైర్మన్, పశువైద్యాధికారి

చందుర్తి(వేములవాడ): పశువైద్య శిబిరాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని రుద్రంగి మార్కెట్ కమిటీ చైర్మన్ ఏనుగుల శ్రీనివాస్, చందుర్తి ఎంపీపీ బైరగోని లావణ్య కోరారు. మర్రిగడ్డలో మార్కెట్ కమిటీ నిధులు, పశుసంవర్ధకశాఖ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన ఉచిత పశువైద్య శిబిరాన్ని ఎంపీపీ లావణ్య ప్రారంభించారు. మార్కెట్ కమిటీ అధ్యక్షుడు ఏనుగుల శ్రీనివాస్ మాట్లాడుతూ మండలంలోని అన్ని గ్రామాల్లో పశువైద్యశిబిరాలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. జెడ్పీటీసీ నాగం కుమార్, పశు వైద్యాధికారి నితిన్‌కుమార్, చందుర్తి సింగిల్‌విండో అధ్యక్షుడు తిప్పని శ్రీనివాస్, మండల కో–ఆప్షన్ సభ్యుడు బత్తుల కమలాకర్, నాయకులు దారం బాల్‌రెడ్డి, సిరికొండ మల్లయ్య, బైరగోని రమేశ్ పాల్గొన్నారు.

ఇంటర్ ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవాలి

- గురుకులాల రీజినల్ కో–ఆర్డినేటర్ వెంకన్న

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): దుమాల గురుకుల ఏకలవ్య మోడల్‌స్కూల్‌లో ఇంటర్‌లో మిగిలిన సీట్లకు విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని వరంగల్ రీజినల్ కో–ఆర్డినేటర్ వెంకన్న బుధవారం ప్రకటనలో కోరారు. ఇంటర్ ఫస్టియర్‌లో ఎంపీసీలో 06, బైపీసీలో 06, సీఈసీలో 01 ఖాళీలున్నాయని తెలిపారు. పదోతరగతిలో 8.5 జీపీఏ కంటే ఎక్కువ మార్కులు సాధించిన గిరిజన బాలికలు మాత్రమే సర్టిఫికెట్లతో ఈనెల 4న ఉదయం 9 గంటలకు పాఠశాలలో హాజరుకావాలని కోరారు.

జాగ్రత్తలతో కళ్ల కలక తగ్గుముఖం



సీజనల్ వ్యాధుల పోస్టర్లను ఆవిష్కరిస్తున్న సుమన్ మోహన్‌రావు

- సీజనల్ వ్యాధులపై అప్రమత్తత అవసరం
- డీఎంహెచ్‌వో సుమన్ మోహన్‌రావు

సిరిసిల్లటౌన్: జాగ్రత్తలతోనే కళ్ల కలక తగ్గుతుందని ప్రజలు భయపడాల్సిన అవసరం లేదని జిల్లా వైద్యాధికారి సుమన్ మోహన్‌రావు పేర్కొన్నారు. సీజనల్ వ్యాధులపై ముద్రించిన పోస్టర్లను తన కార్యాలయంలో బుధవారం ఆవిష్కరించి మాట్లాడారు. వర్షాకాలంలో వైరల్ ఫీవర్స్‌తోపాటు కళ్ల కలక వచ్చే అవకాశాలుంటాయన్నారు. కండ్లకలక వచ్చిన వారి టవల్స్, బెడ్‌షీట్స్‌ను ఇతరులు షేర్‌చేసుకోవద్దని సూచించారు. ఆశవర్కర్లు, ఏఎన్‌ఎంలు కళ్ల కలక వచ్చిన వారికి సమీపంలో పల్లె, బస్తీ దవాఖానాలకు పంపించి చికిత్స అందిస్తున్నారని తెలిపారు.

బాలికను వేధించిన యువకుడి అరెస్టు

ముస్తాబాద్(సిరిసిల్ల): మండలంలోని సేవాలాల్ తండాలో ఓ బాలికను వేధించిన యువకుడిని అరెస్టు చేసినట్లు ఎస్సై శేఖర్‌రెడ్డి తెలిపారు. బాలికను లకావత్ నాగరాజు కొద్ది రోజులుగా వేధిస్తున్నాడని ఆమె తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, విచారణ చేపట్టామన్నారు. బుధవారం నిందితుడిని అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించినట్లు పేర్కొన్నారు.

అర్హులకు 'డబుల్' ఇళ్లు ఇవ్వండి

- వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బుర్రి ప్రసాద్



మాట్లాడుతున్న ప్రసాద్

సిరిసిల్లటౌన్: పేదల కోసం నిర్మించిన డబుల్‌బెడ్ రూమ్ ఇళ్లను అర్హులకు వెంటనే పంపిణీ చేయాలని వ్యవసాయకార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బుర్రి ప్రసాద్ కోరారు. సిరిసిల్లలోని సీఐటీయూ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో మాట్లాడారు. డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల పంపిణీలో రాష్ట్ర ప్రభుత్వం కాలయాపన చేయడం తగదన్నారు. వెంటనే అర్హులకు ఇళ్లు ఇవ్వకుంటే రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. నాయకులు బాబు, రాజు తదితరులున్నారు.


చోరీకి యత్నించిన ఇద్దరికి దేహశుద్ధి



స్థానికులు పట్టుకున్న వ్యక్తులు (సర్కిల్‌లో)

సిరిసిల్లక్రైం: ఆటోనగర్‌లో నిలిపివున్న ఆటోలో నుంచి వస్తువులను చోరీ చేసేందుకు ప్రయత్నించిన ఇద్దరు వ్యక్తులను స్థానికులు పట్టుకొని,దేహశుద్ధి చేశారు. వారి వివరాల ప్రకారం.. ఆటోనగర్‌లో బుధవారం నిలిపివున్న వాహనాల మధ్య ఇద్దరు వ్యక్తులు తిరుగుతూ అనుమానాస్పదంగా కనిపించారు. వారిలో ఒకరు ఓ ఆటోలో ఎక్కి, అందులోని వస్తువులను దొంగిలించేందుకు ప్రయత్నించాడు. ఇది గమనించిన ఆ ఆటో యజమాని, మరో వ్యక్తి వారిని పట్టుకొని చితకబాదారు. నిందితులు మద్యం తాగి ఉన్నారని, అడిగితే ఏం చెప్పడం లేదన్నారు. తర్వాత ఇద్దరినీ పోలీసులకు అప్పగించినట్లు పేర్కొన్నారు. ఈ విషయమై పోలీసులను వివరణ కోరగా ఇంకా కేసు నమోదు చేయలేదని తెలిపారు.

బస్టాండ్‌లో ద్విచక్రవాహనం చోరీ



సీసీ ఫుటేజీలో వాహనం తీసుకెళ్తున్న వ్యక్తి (సర్కిల్‌లో)

బస్టాండ్ ఏరియాలో నిలిపిన ద్విచక్రవాహనాన్ని గుర్తు తెలియని వ్యక్తి ఎత్తుకెళ్లాడు. వివరాల్లోకి వెళ్తే.. సిరిసిల్ల పట్టణంలోని పద్మనగర్‌కు చెందిన మ్యాన నారాయణ ద్విచక్రవాహనంపై అతని మనవడు మంగళవారం సాయంత్రం సిరిసిల్ల పాత బస్టాండ్‌కు వెళ్లాడు. అక్కడున్న మైసమ్మ టెంపుల్ వద్ద వాహనాన్ని నిలిపి, బస్సులో వేములవాడ వెళ్లాడు. అరగంటలో తిరిగి రాగా వాహనం కనిపించలేదు. దీంతో అతను తన తాతకు సమాచారం ఇచ్చాడు. ఇద్దరూ కలిసి చుట్టుపక్కల ప్రాంతాల్లో వెతికినా ప్రయోజనం లేకపోయింది. బస్టాండ్ వద్ద ఉన్న బేకరీ సీసీ ఫుటేజీ చూడగా ఓ వ్యక్తి ద్విచక్రవాహనాన్ని తీసుకెళ్తున్నట్లు గుర్తించారు. అయితే అందులో స్పష్టత లేదు. ఈ విషయమై పోలీసులకు ఫిర్యాదు చేస్తానని నారాయణ తెలిపాడు.

ఇళ్లు కూలిపోయిన వారిని ఆదుకోవాలి



కూలిన ఇంటిని పరిశీలిస్తున్న నాయకులు

బోయినపల్లి(చొప్పదండి): వర్షాలకు ఇళ్లు కూలిపోయిన వారిని ప్రభుత్వం ఆర్థికంగా ఆదుకోవాలని ఆలిండియా ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ చొప్పదండి నియోజకవర్గ ఇన్‌చార్జి ముత్యాల విజయ్‌కుమార్ డిమాండ్ చేశారు. బుధవారం బోయినపల్లి మండలంలోని బూర్గుపల్లిలో వర్షాలకు కూలిపోయిన ఇళ్లను పరిశీలించి, బాధితులతో మాట్లాడారు. వరదల కారణంగా వరి, పత్తి చేలల్లో ఇసుక మేటలు వేసి, రైతులు తీవ్రంగా నష్టపోయారని పేర్కొన్నారు. దెబ్బతిన్న రోడ్లను బాగు చేయాలని కోరారు. ఆయన వెంట నాయకులు వంశీ, కనకయ్య, సత్తయ్య తదితరులున్నారు.

కన్నకొడుకే కాలయముడు

- భూమి కోసం తల్లిని చంపిన తనయుడు



సంఘటన స్థలంలో కనుకవ్వ మృతదేహం వద్ద రోదిస్తున్న కూతురు



కనుకవ్వ (ఫైల్)

తిమ్మాపూర్(మానకొండూర్): కన్న కొడుకే కాలయముడయ్యాడు. నవమాసాలు మోసి, కని, పెంచిన తల్లి తమ్మనవేణి కనుకవ్వ(60)ను భూమికోసం దారుణంగా హత్య చేశాడు. ఈ ఘటన కరీంనగర్ జిల్లా గన్నేరువరం మండలం జంగపల్లి గ్రామంలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. తిమ్మాపూర్ మండలం రేణికుంట గ్రామానికి చెందిన తమ్మనవేణి కనుకవ్వ(60)కు ముగ్గురు కూతుళ్లు, కుమారుడు వినోద్ ఉన్నాడు. భర్త గతంలోనే చనిపోవడంతో అన్నీతానై పిల్లలను సాకి ప్రయోజకులను చేసింది. కూతుళ్లు, కుమారుడి వివాహాలు చేసింది. భర్త తరపున వచ్చిన ఎకరం భూమిని తన కొడుకు వినోద్ పేరిట రిజిస్ట్రేషన్ చేసింది. తనతల్లిగారి తరపున వచ్చిన రెండెకరాల్లో వ్యవసాయం చేసుకుంటూ చిన్నకూతురుతో కలిసి ఉంటోంది. కొద్దిరోజులుగా తల్లిగారిల్లు రేణికుంటలో ఒక్కతే అద్దెకు ఉంటోంది.

రెండెకరాలపై కన్నేసిన కొడుకు..

తండ్రి తరపున వచ్చిన ఎకరం తీసుకున్న కొడుకు వినోద్.. కనుకవ్వ పుట్టింటివారు ఇచ్చిన భూమి కూడా తనకే కావాలని రెండేళ్లుగా గొడవ పడుతున్నాడు. అది కూతుళ్లకు ఇస్తుందనే అనుమానంతో గతేడాది పంటలు వేయకుండా అడ్డుకున్నాడు. అయినా తల్లి భూమి రిజిస్ట్రేషన్ చేయలదు. దీంతో ఈ ఏడాది బలవంతంగా భూమి లాక్కుని, కౌలుకు ఇచ్చాడు. దీంతో గొడవలు పెద్దవయ్యాయి.

గండ్లు పూడ్చేందుకు వెళ్లి..

ఇటీవల కురిసిన వర్షాలకు వరద పోటెత్తడంతో జంగపల్లి శివారులోని వ్యవసాయ భూమిలో గండ్లుపడ్డాయి. వాటిని పూడ్చేందుకు వినోద్ బుధవారం ఉదయం వెళ్లాడు. ఈ విషయం తెలుసుకున్న కనుకవ్వ కూడా పొలం వద్దకు వెళ్లింది. తన భూమిలో ఎందుకు సాగు చేస్తున్నావని కొడుకును అడిగింది. ఈక్రమంలో ఇద్దరి మధ్య మాటామాట పెరిగింది. ఆవేశానికి లోనైన వినోద్.. తన చేతిలోని పారతో తల్లి తలపై బలంగా కొట్టాడు. దీంతో కనుకవ్వ తీ వ్రగాయాలతో అక్కడికక్కడే కుప్పకూలి మృతిచెందింది. కూతుళ్లు ఇచ్చిన సమాచారం మేరకు తిమ్మాపూర్ సీఐ ఇంద్రసేనారెడ్డి, ఎల్‌ఎండీ, గన్నేరువరం ఎస్సైలు ప్రమోద్‌రెడ్డి, నర్సింహారావు ఘటన స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. వినోద్‌పై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.